అర్ర

యేమేమో చెప్తవు.
యెన్నెన్నో చూపిస్తవు.

'యీ అర్ర బాగా యిరుకై పోయింది
దీన్నిండ ముక్క వాసనొస్తుంది.'


గోడలకి నిండిన నీటిచెమ్మ
అల్లుకపోయిన పాదుష్టు-


గడ్డి రాలుతున్న పిట్టలొదిలేసిన గూళ్ళు.

'దీని తూర్పు దర్వాజ మూసుకుపోయింది.
యింక వొకటే తొవ్వ బయటకు...'

పచ్చ పచ్చ చెమనులనూ
మెరిసే సిమెంటు అద్దాలనూ
చూయిస్తూ 'పా బయటకు' అంటవు-

ఆశపడీ లోభపడీ
పడమటి తొవ్వలో





నడిచినకొద్దీ
పచ్చని పచ్చిక కింది
పల్లేరుగాయలు గుచ్చుకుంటయి.

యెందుకో యెన్నేండ్లయినా
యీ విశాలమయిన జాగల యిరుకై
వుక్కిరి బిక్కిరి అయితది నాకు.

రివ్వుమని కొట్టె చల్లగాలిలో
వుబ్బరపోస్తది నాకు.

యెంతయిన చెప్పు.

మళ్ళా ఆ అర్రలోనే
నాకు వూపిరాడుతది.

మాసిన సున్నం గోడల మీది
యెలిసిపోని జాజురంగు మీదనే
యింకా మనసు గుంజుతది.

యీ అర్ర గోడలే గద
మనకు గోడల్ని కూలగొట్టే
సోయినిచ్చింది.

యీ అర్ర చెత్తు నీడల్నే గద
మనం గీతల్ని మలిపెయ్యాలని
కొత్త పాటలు పాడినం.

యియ్యాలెందుకో
దర్వాజలు మూసుకపోయినయని
అర్రను పాడుపెడదామంటే
మనసొప్పుతలేదు.

'యెవ్వరుంటలేరు గదా'
అని యిడిసిపెట్టి పోయినంక
చయిన్‌తో నిద్ర పడతలేదు.

తల్లసుంటి అర్ర
మెత్తని వొడిలోనే
మళ్ళా మళ్ళా
తల పెట్టుకు
పండుకోవాలనిపిస్తది.

తలుపులు బార్లా తెరిసి
యెగిరిపోయిన పిట్టలన్నిటిని
లోపలకు పిలవాలని
ఒక్కటే ఆరాటమనిపిస్తది.

సందుక

నువ్వెప్పుడూ యింతే.

మనం కలిసినప్పుడల్లా
ఆ పాతకాలపు సందుకను
తీయిస్తవు.

దాన్ని తీసినప్పుడల్లా
పైనున్న దుమ్ము చెరిగిపోయి
మన చిన్నతనం
మాసిపోతదేమోనని
నాకు ఒకటే రంది.

సందుక మూత
కిర్రుమంటూ
తెరుచుకుంటుంటే
'తిన్నవా బిడ్డా,' అంటూ
వీపు నిమిరే నాయనమ్మ
తొక్కులాట యాదికొస్తది.

పల్లె నుండి పట్నం దాకా
సర్వీసు బస్సులో ప్రయాణం
చేసిన పేదరికపు
గునుకపూలు
ఇంటి నిండా పూస్తయి.

రంగుపోయిన
పక్షి ఈకలూ
ఎండిపోయిన
బంతిపూల రెక్కలూ
రాలిపోయిన
బంగారుపురుగు రెక్కలూ...

మనం నీటిమీద
దుంకులాడించిన
పెంకాసు ముక్కలూ...

ముదురు రంగులోకి
జీర్ణమవుతున్న
అట్టలు లేని పుస్తకాలూ...

ఎప్పుడో కాని కాలానికి
మత్తడి దుంకే
మన వూరి చెరువును
గుర్తు తెచ్చే
ఒకటో రెండో
సగం చినిగిపోయిన
కరపత్రాలు.

‘అంతా ఐపోయిందిప్పుడు
కాలం ఐపోయింది.’


ముసలి కాగితం రాలిపడుతున్న
పుస్తకాల్ని ఒకటొకటిగా
బయటకు తీస్తూ అంటవు

‘వీటిల్లో ఈ రాతల కింక
కాలం చెల్లిపోయింది
చెరిపేయాలి వీటన్నిటినీ.’

ఊపిరిపోసిన
ఒక్కో వాక్యం కింద
అరిగిన పెన్సిలుతో
గీసుకున్న గీతలు-
అక్కడక్కడా మడుచుకున్న
పేజీలూ-
పక్కన మార్జిన్‌లలో
రాసుకున్న నోట్సులూ...

సందుక
అడుగు నుంచి
తెరలు తెరలుగా
బాగా పరిచయమున్న
ఒక కొత్త సువాసన
చుట్టుముడుతది.

చెంప కానించుకున్నప్పుడు
వెచ్చని వాగునీటి కింది



గరుకైన ఇసుక
మెత్తదనం ఆపేక్షగా తగుల్తది.

‘అత్తా పత్తా లేకుండా
వీడెక్కడ తిరుగుతుండో‘

పాత కళ్ళద్దాల్లోంచి
తండ్లాడే బాపు
కండ్లల్లో మెదులుతడు.

కొమ్మల్ని తాకంగానే
జలజలరాలే
ఒనగాయల్లా
ఒక్కో కాగితంలో నుండీ
గడిచిన క్షణాలు
ఉక్కిరిబిక్కిరి చేస్తయి.

‘యెట్ల చెరిపేసుకుంటం?


అరచేతుల్లో భాగమైన వాటిని...

‘యెంత వెలిసిపోయినా
యెట్ల పారేసుకుంటం?’

మన తొలి యవ్వనాల
రంగురంగుల
ఉద్రేకాల్ని?

‘యెట్ల విడదీస్తం?’

మన ఇంట్లో ఒక అందమైన
మూలగా అమరిపోయిన
సందుకను...’



గడచిన మనల్ని
మనం మళ్ళీ
అతి జాగ్రత్తగా
మడత పెట్టుకుని
సందుకలో
భద్రపరచుకుందాం.

ఎప్పుడైన
ఏదో పోగొట్టుకున్నట్టు
ఓర్చుకోలేని దుఃఖము
కలిగినప్పుడు

ఇంట్లో ఈ జాగ కాడికొచ్చి
సందుక బుజానికి
తల ఆనిస్తే
యెంతో ఊరట!

అవ్వా!

'మల్ల యెప్పుడొస్తవు కొడుక'

యేండ్ల ముచ్చట్లు చెప్పుకొనే
బుద్ధి తీరకముందే
బయల్దేరిన
నా చెయ్యిని చేతులల్లకు తీసుకుంది-

గుడ్డి అద్దాల కండ్లెనుక
కుర్వక కుర్వక కుండపోతగ
కురిసిన వానసుంటి
ఆపేక్ష-

'నువ్వొచ్చెటాల్లకు నేనుంటనో పోతనో
రక్తముడిగిపోయింది కొడుక'

యింట్ల యెప్పుడు చూసిన
దువ్వెనలోలె గిరగిర తిరిగే పిల్లల్లేరు-

యెనుక అర్రల నుండి
యిరాము లేకుండ కొట్టుకునె

మగ్గం యినబడుత లేదు-

యెటూపోలేక యింట్ల గాలి బీరిపోయినట్టుంది.

'సూరతుకు బతుక పోయిండు కొడుకు.
యీడ నేసిన బట్టలెవరు తీసికొంటలే.
రెక్కల కష్టమంత యేట్ల పోసినట్టాయె.
దారపు కండెలు గావాలంటెనే
అప్పుల తాడు మెడకు బడె.'


యేండ్ల నుండి సున్నంజాజుల్లేక
పాత మట్టిగోడల యిల్లు
అల్ కబీరుకు తీసుకపోతున్న
బక్కావు లెక్క బొక్కల్దేలింది.

'అంత అయిపోయింది బిడ్డ
వయసు పోరగాల్లంత
దేశాలు పట్టి పోయింర్డు.
యెప్పుడొస్తరో తెల్వదు-
యియ్యల రేపు అనుకుంట
కాటికి కాల్లు జాపుకోనున్న.'

'మీరున్న జాగల మంచిగుంటద కొడుకా?'

యెంత మంచిగున్నా-

బిడ్డల కోసం పానమిచ్చి
యెప్పుడు గూట్లెకొస్తరోనని
దినామూ రాత్రీ
కండ్లల్ల వొత్తులేసుకొని తల్లడిల్లే
నీ అసుంటి ఆత్మగల్ల తల్లుల్లేరు.




అన్నీ వుంటయిగని అవ్వా-

కాయలు గాసిన చేతుల
బర్సుదనం తోటి
మెత్తగ చెంపలు పునికి

'యాడున్నా సల్లగ బతుకు బిడ్డా'

అని దీవించే నువ్వు లేవు.



చెరువేమయ్యింది

'యిక్కడ వొక చెరువుండేటిది.'

'యేదీ యిప్పుడు'


కూలిపోయిన
కట్ట మీద నడుసుకుంట
మట్టిబెడ్డలేరుకుంటం.

'కాలం కానప్పుడు
కనీసం వొక బురదగుంటలెక్కనయిన వుండేడిది.'

కాల్లుజేతులుడిగినా
పొక్కిలయిన వాకిట్ల కూసుండి
వచ్చెపోయెటోల్లను అటకాయించే
ముసలి అవ్వోలుండేడిది.

యింటి మీద గూనపెంకులల్ల అద్దం ముక్క లెక్క
యెండిన మొగులుకు యాల్లాడుతుండేది-

'యెట్ల యెగిరెటోల్లం
చెరువున్నప్పుడు-



కాలమయి చెరువుల
నీల్లున్నప్పుడు.'

కప్పలు యిటు అటు గునగున దుంకినప్పుడు

గోజలు మూతిపెట్టి చల్లనీల్లు
మురిపెంగ తాగినప్పుడు

బురద గట్టు మీద గడ్డిపోసలు వంగి
నీల్లను కొసిరి కొసిరి ముద్దు పెట్టుకున్నప్పుడు

చెరువు కొంగు పట్టుకొని
యెట్ల ఉరికెటోల్లం-

యెప్పుడోసారి నాల్గు వానలుపడి
చారెడు నీల్లొస్తె


అత్తగారింటి నుంచొచ్చిన
అక్కసుంటి చెరువును

కావలిచ్చుకొని
యెన్నెన్ని ముచ్చట్లు
చెప్పెటోల్లము.

'యిప్పుడు యేదీ చెరువు
యేదిక్కడ.'

నీల్లు లేవు
బెకబెక కప్పల్లేవు
మునుగుకుంట తేలె
బుడుబుంగల్లేవు

'కాలం గాలేదు బిడ్డ'



అని గుడ్లల్ల నీల్లు తీసుకునే
అవ్వ లేదు.

భీవండికి బతుకపోయినా
బతుకమ్మ పండుక్కు
తల్లిగారింటికొచ్చె
అక్క రాలేదు.

దీపాలు ముట్టియ్యకముందె
వాడకట్టంత మారుమోగె
వుయ్యాల పాటల్లేవు.

'యేమయింది
చెరువేమయింది
చెరువుకేమయ్యింది'

బోర్లేసిన
బతుకమ్మ తపుకు

సర్కారు తుమ్మలల్ల
యిరుక్కపోయిన
నీల్లు లేని తెల్లమబ్బు

చెరువేమయిందో
యెన్నటికీ చెప్పవు.

కుక్కగొడుగుల్లెక్క
మొలుచుకొచ్చిన
గ్రనైటు కనీలు

చెరువుకేమయిందో
యెప్పుడూ చెప్పవు.

మా యింటి వెనక మాయమైన చెరువును తల్చుకొంటూ...

యాడికి పోయిన్రు?

'లెక్కలేనంతమంది...'

ఎన్నాండ్ల సందో ఆపుకున్న దుక్కం
ఒక్కసారి పొర్లుకు రాంగనే
చెంగు నోటికడ్డం పెట్టుకోని
పక్కున పలిగింది-

తంగేడి పూలసుంటోల్లు

'అంత యీ మూడు నాలుగేండ్లల్లనే
రాలిపోయిండ్రు-
యెవ్వల్లూ ముప్పైయేండ్లు దాటలే...'

నిన్నగాక మొన్న చూసినట్టుంది-
కండ్లల్ల మెదులుతుండ్రు.

'పచ్చని చెట్లలెక్క ఉండెటోల్లు.
ఒక్కొక్కలే పీనుగలై వస్తుంటే
కడుపంత తోడినట్లై
పానం కలకలా అన్నది.'

పూర్లల్ల పిలుద్దామన్నా
ఒక్క వయసు పొల్లగాడు
కనబడుతలేడు.

'సావంగ మిగిలినోల్లు
బతుక పారిపోయింద్రు'

యిండ్లన్ని మొండిగోడలైనయి
కుంటలు బాయిలు ఎండుకపోయినయి.

'యెంత చెప్పుకున్నా యెతలు దీరయి తమ్మీ...'

చిన్నప్పట్నుండి
కాల్లల్ల మెసిలినోల్లు
బుద్ధి తెలిసిన కాడి నుంచి
ఎవ్వరికి అన్నాలం చెయ్యనోల్లు
బూడిదకూడ మిగలకుంట పోయింద్రు.

'పూర్లన్నీ పాడుబడ్డ బాయిల్లెక్కయినయి.'

కల్సి ఆడుకున్నోల్లంత
యాడికి బోయిన్రో మనసున బట్టక
గాలి
యిండ్ల ముంగట
చెదలు పట్టిన మొగురాలకు
కూలబడ్డది.

పూర్లకు పూర్లే
ఎందుకు చిన్నబోయినయోనని
యెండుక బోయిన కొమ్మలు
యెక్కిల్లుపట్టి యేడుస్తున్నయి.

అంజాన్

తలపై
రెండు నిండు మట్టికుండలతో

అరచేతుల్లో
ఎగరడానికి సిద్ధంగా ఉన్న పక్షిపిల్లలతో

దూదిమబ్బుల
నీలినీటి ఆకాశం తెరలపైన తేలుతూ

పేగు తెంచుకున్న నేల మీద
పెంచుకున్న ఎనలేని ప్రేమతో
రాలాను...

విమానం కిటికీల్లోంచి
కింద
వంటి మీద
కొత్త కొత్త నగల్తో కొత్త కొత్త వలువలతో
కొంగ్రొత్త చూపుల్తో
నా నగరం...

నా ఆదిమ ప్రేయసి!

నాకోసం నిద్రమాని
'ఇన్నేళ్ళుగా ఏమైపోయావ్' అంటూ
కోపంతో అలకతో ప్రేమతో
నీరు పొర్లుతున్న చెరువుల కళ్ళతో
నన్నలుముకుంటుందనుకున్నా.


తెగిపోయిన నా రెక్కల్ని
సుతిమెత్తని చేతులతో నిమిరి
నా భుజాలకు అతికిస్తుందనుకున్నా.

నేను మోసుకొచ్చినవన్నీ
తనివితీరా తడిమి
అతి జాగ్రత్తగా
చీరచెంగులో పొదువుకుంటుందనుకున్నా.

ఏడేళ్ళ నవ్వుల్నీ
పచ్చి నెత్తుటి కన్నీటి మరకలనీ
కాళ్ళ కింద నలిగిపోయిన పసిరెక్కలనీ
వాడిపోయిన కళ్ళనీ వేలాదిగా రాలిపోయిన పూలరెమ్మలనీ
ఏకబిగిన ఏకరువు పెట్టి ఊపిరాడనీయదనుకున్నా!

నేలకు దిగిన విమానంలా
ఒంటరిగా దిగాలుగా
నేను

నా ప్రేయసి
నా ముందు నుంచే హడావుడిగా
అటూ ఇటూ నడిచిపోయింది.



ఉరుకులతో పరుగులతో
నాకు అతి కొత్తయిన భాషల చప్పుళ్ళతో
నేను పోల్చుకోలేని ముఖాల మెరుపులతో
సరసరా జారిపోయింది.

నావైపు చూసే తీరికలేదు
చూసినా గుర్తుపట్టలేదు.


అర్ధరాత్రి వర్షపు చీకట్లో పారేసుకున్న
ఉంగరంలా
జరజరా దొర్లిపోయింది.

యుగాలుగా
తన ఎడతెరపి లేని దు:ఖ బీభత్స ప్రేమ ప్రవాహంలో
మునిగిన నన్ను
ఏడేళ్ళ ఎడబాటుతోనే పూర్తిగా మర్చిపోయింది.

నా ఊపిరి తేమలోని వెచ్చదనాన్నీ
నా పెదవుల ముద్దులోని ఉప్పదనాన్నీ
నా కౌగిలింతలోని చెమటవాసననీ

తానెన్నడూ ఎరగనట్టే
ఎడమొఖమై అంజాన్ కొట్టింది

నేనే మనసుండబట్టలేక
గ్యాపకాల సుడిగాలులతో పిలిచినా
రెండు చేతులూ విరగబూసి చాచినా
ఎవరు నువ్వు అన్నట్టుగా
ఎకసక్కెపు చూపుల్ని విసిరి పారేసింది.



మట్టినీటి కుండలు పగిలి
రెక్కలురాని పక్షి ఈకలు చెదిరి
నేల మీద కలలని ఏరుకుంటున్న
నన్ను

దారికడ్డం లెమ్మంటూ
నూకేసి విసవిసా పోయింది.

నిలువునా తడిసి ముద్దైన నేను

స్పర్శ మరిచిన
ప్రేయసి తడి లేని చూపుల ముందు

నాకు నేనే అజ్నబీని!

గాల్లో ఎగిరాక గానీ

తీరా గాల్లో
ఎగరడం ప్రారంభించాక గానీ

భూమ్మీద ఏమి
వదిలి వచ్చామో
తెలియదు.

నేల మీద తిరుగుతున్నంతసేపూ
ఏమి పోగొట్టుకుంటున్నామో
సోయి ఉండదు.

విమానం లోహపు రెక్కలార్చుకుని
రాక్షస యంత్రాల నోరు తెరచి
వీడ్కోళ్ళ చివరి ఆనవాళ్ళను
మింగేశాక గానీ

మూసుకున్న కన్రెప్పల
వెనుక
చూడలేకపోయిన దృశ్యం
అగుపడదు.

చుట్టూ స్పృశించలేని
నీటిపొర
దిగులుగా వ్యాపిస్తేగానీ

వణుకుతున్న చేతులతో
ముఖాన్ని తడిమిన
మట్టి ఆత్మీయత
అర్థం కాదు.

మనది కాని
ఒక శబ్ద ప్రపంచం
మన భాష అయ్యాక

పోగొట్టుకున్న
పలకరింపుల ఆర్తి వెనుక
అనుబంధాల గాద్గదికత
వినబడదు.

ఎన్ని ముఖాల చిరునవ్వులు
ఎన్ని చేతుల స్పర్శలు
ఎన్ని కంఠస్వరాల ఆర్ద్రతలు

దేన్నీ సంభాషించలేని
'హలో'లుగా ముగిసిపోయాయో

చేతుల్లోంచి
చివరిగా జారిపోయిన
ఇసుకరేణువు గరుగ్గా తగిలినప్పుడు
కానీ తెలియలేదు.

ఇప్పుడు అంతా మాయమైనట్టే
ఉంటుంది.

అన్నీ కనబడకుండా పోయినట్టే
ఉంటాయి.

మళ్ళీ మఖ్‌మల్ తెరలు
గరగరలాడుతూ
పైకి లేచినప్పుడుగానీ
అర్థం కాదు
నాటకం కొత్త అంకం మొదలైందని!

నాయనొస్తాడు!

సందు మూల మలుపు
తిరుగుతున్నపుడు

‘ఇదిగో ఇక్కడే’

అంటూ చీర చెంగుతో
కళ్ళు తుడుచుకుంటూ
చూపించింది

సందు మలుపు దగ్గర
బండరాయి
దుమ్ముపట్టి...
అక్కడక్కడా నల్లని చారికలతో...

ఎన్నేళ్ళయింది... ఆరేళ్ళు కదూ!

‘నాన్నను పట్టుకుంది ఇక్కడే కదా అమ్మా’

ఎప్పుడో అమ్మ చెప్పినదాన్ని
జాగ్రత్తగా గుర్తు పెట్టుకుని
వొత్తి పలుకుతూ...

‘ఆ రాయి మీదే ఆయన తలపగలగొట్టిన్రు
ఆ దుమ్ము వెనక నుంచి
వచ్చిపోయేవాళ్ళని
పలకరిస్తున్న పాట
ఆయన నెత్తురే’

గడ్డిపూల చేతుల్తో
రాయిని హత్తుకుంటున్న నేల.

లోలోపల్నుంచి తన్నుకొస్తున్న
పాటకు దరువేస్తూన్న గాలి.

‘నాన్నను ఎందుకు పట్టుకుపోయిన్రో తెలుసా నీకు’

లోతైన చిన్నచిన్న కళ్ళలోకి చూస్తూ
పాపనడిగిన

ఆడుకుంటున్న పాప దబదబా
రాయి దగ్గరికెళ్ళి
రెండు గడ్డి మొక్కల్ని పూలతో తెంపుకొచ్చింది.

‘ఇవ్వంటే నాన్నకిష్టం కదా అమ్మా’

అంటూ విశాలమైన నుదురుతో
నాన్నను గుర్తు చేసుకుంది.

తాను ప్రేమగా తెచ్చుకున్న
గడ్డిపూలతో
కొంచెంసేపు అపురూపంగా ఆడుకుని
పాప

'మళ్ళీ సభ ఎప్పుడు అమ్మా'

'ఏం ఎందుకు?'

'నాన్న అక్కడికి వస్తాడుగా...'

మెరుస్తున్న కళ్ళతో
మిలమిలలాడింది పాప!

పాప పరికిణీ అద్దాల్లో
వెలుతురు
ఉయ్యాలలూగుతూ
రాయి చుట్టూ తిరుగుతోంది.

ఒక రెండు నిమిషాలు
పాప
రాయి చుట్టూ తిరిగి
తన చేతిలోని పూలని
అతి పదిలంగా దానిపై నుంచి

'సభ దగ్గరికి పోదాం... పద...'

అంటూ
సాగుతున్న సాయంత్రపు నీడలపై
పెద్దపెద్ద అంగలతో నడుస్తూ
దారితీసింది

వీరన్న కోసం

సారూ!

యెన్ని యేళ్ళకు
మళ్ళీ ఇట్లా మీ ముందు
మీ వెచ్చని చేతిలో
చేయి వేసి కూర్చున్నా.

మీ మాటల్లోని
మౌనపు హోరునూ
నిశ్చల ప్రవాహాల్నీ
అపురూపంగా తాకాను.

రెక్కలు టపటపలాడిస్తూ
నీటిపై ముక్కు ఆనించి
పిట్ట చెప్పిన గుసగుసల్నీ

రాలిపడే ముందు
భూమిని ముద్దాడి
వానచినుకు చిందిన సంగీతాన్నీ

చెవులు చిల్లులుపడే నిశ్శబ్దాన్ని ఉరిమే
మేఘాల శరీర విద్యుత్తునూ
అనుభూతించాను.

మీతో కూర్చున్న ఆ గంటసేపూ

ఓటమినెరుగని
గులకరాళ్ళ ఓపికనీ

గురి తప్పని
ఆదివాసి బాణపు పదునునీ

పలికిన సాంగత్యపు సౌందర్యంలో
వివశుడనయ్యాను.

ఒక సుదీర్ఘలిప్తపాటు
మన కలయిక-

స్థలానికీ కాలానికీ ఎంత ప్రేమ ఉన్నా
రాజ్యానికుండాలి గదా...!

బలవంతపు నిషేధపు తెరల వెనుక
మాటలూ
కలయికలూ
యెప్పుడూ అసంపూర్ణాలే!!

దూరంగా నెట్టివేయబడ్డా
అల
వెనక్కి వచ్చేందుకు
పలుమార్లు విరిగిపడుతుంది.

జైలు కిటికీల్లోంచి
గ్రహణపు చంద్రుడు
మళ్ళీ మళ్ళీ మసకబారిపోతాడు.

మెత్తగా నొక్కలేని వెచ్చని చేతులూ
గ్నాపకాల్ని వెంటాడే కంటితడి వెలుగూ
తాకలేని ఆకాశమూ...

మొదలూ తుదీ లేని ఎదురుచూపులా
చుట్టుకుపోతాయి.

మళ్ళీ ఒకసారి
యింతకాలం తర్వాత

కొన్నివేల మైళ్ళ ఆవల నుండీ

నదుల్నీ సముద్రాల్నీ
ఏకకాలంలో ధ్వనించే

మీ స్వరం విన్నాక

వాడెంతకూ
అణగదొక్కలేని
మీ అంతరాత్మని దర్శించాక

మీ గొంతులో అలసట కన్నా
చెదరని ధైర్యం
ఆర్తితో తడిమాక

ఒక కొత్తదనం
ఊపిరి పోసుకుంటుంది.

మళ్ళీ మీ ముందుకొచ్చి
మరో జన్మ పొందడానికి
లోలోపల ఒక పెనుకెరటం
సుడులు తిరుగుతుంది...

ఎదురుచూపు


అప్పుడప్పుడు
కనుకొలకుల్లో
నిప్పుకణిక ఉబుకుతుంది.

ఎప్పుడూ
శరీరాన్ని
చుట్టేస్తూ
జడివాన కాలుస్తుంటుంది.

అప్పుడప్పుడూ
పెదవులకు
మౌనం వేళ్ళాడుతుంది.

ఎప్పుడూ
గ్నాపకాల నొప్పి
గొంతుకు అడ్డం పడుతుంటుంది.

అప్పుడప్పుడూ
నీ ఉత్తరాల్లో సువాసనలు
అక్షరాలౌతాయి.



ఎప్పుడూ
మనం తడిసిన
మట్టి పరిమళాలు
అమ్మలా
తలలో వేళ్ళు పెట్టి నిమురుతాయి.

జీవితం మనల్ని విసిరేసిందో
మనమే జీవితాల్ని ఒడిసిపట్టుకున్నామో

దిగంతానికి అవతలి పక్క నువ్వు యివతలి పక్క నేను.

బాధ మనల్ని ముంచేసిందో
మనమే గాయాల్ని కడుక్కుని బాధని ఆరేసామో

ఇంకిపోయిన కన్నీటి గీతకు
అటువైపు నువ్వు యిటువైపు నేను.


స్మృతులు మనల్ని బూడిద చేశాయో
మనమే పూలరెమ్మల సన్నని జ్వాలల్ని
భాషగా మార్చుకున్నామో

వూగుతున్న కాలానికి యిటు క్షణం నేను అటు క్షణం నువ్వు.

రాత్రులు మనల్ని ముక్కలు చేశాయో
పగళ్ళని మనమే ఉండలుగా చుట్టి పారేశామో

దుమ్ము పట్టిన ఆకాశం డైనింగ్ టేబుల్‌కి
అవతల పక్క నువ్వూ యివతల పక్క నేనూ.

యిద్దరి మధ్యా ఒక గతమూ-
ఒక భవిష్యత్తూ-
ఒక అర్ధ భూగోళం.



పిడికిట్లోంచి జారిపోయేవి ఏడు సముద్రాల ఇసుకదిబ్బలో
చూపులని కమ్మేస్తున్నవి బూజు మబ్బుల కెరటాలో

ఎదిరిచూపుల దారాలకు ఇటు చివర నేను
అటు చివర నువ్వూ...

ఎప్పుడు మొదలవుతుందో తెలియని తోలుబొమ్మలాట.

ఒక్క ముచ్చట

యిన్నేండ్లుగ
యెన్నడూ వినబడని గొంతు వొకటి
నెర్రెలు బారిన నేలమీద యెగిరి దుంకి

‘ఇదంత నా నేల
దీని సరిహద్దు గీతల్ని నేను నిర్ణయిస్త’

అని ప్రకటించింది.

‘ఈ నక్ష మీద
అధికారం మొత్తం నాదే కావాలి’

అంటూ పెద్ద నోరుతో అరిచింది.

‘యీ భూమి మీద ఇంత నెత్తురు పారుతుంటె
యిన్ని తలకాయలు తెగిపడుతుంటె
చారెడు నేల కోసం యిన్ని గొంతులు పగిలి
గుక్కెడు నీళ్ల కోసం యిన్ని గుండెలు యెండి
బుక్కెడు మెతుకుల కోసం యిన్ని బతుకులు మండి

యిన్నేండ్ల సంది కన్నీరు మున్నీరు అవుతుంటె
యెక్కడున్నవ్ బిడ్డ నువ్వు
యాడికి బోయినవ్'

అవ్వ కోపంగ అడిగింది.

'ఓ అవ్వా!
నేను మొదట్నుంచి నీవోడినే
యీ నేల గాలీ రాజ్యం అన్నీ నావే
నీకు అసలయిన పాలకుడ్ని నేనే
నా కనుసైగలల్ల
నడవాల్సిన యీ రాజ్యాన్ని
యాభైయేండ్ల నుండి
యికుమతు దెల్సిన దొరలు
నాకు కాకుండ చేసిండ్రు

మన పండ్లన్నిటిని మెక్కి
బీళ్ళు మనకిచ్చిండ్రు...

వాండ్ల నుండి సొతంత్రం కోసుకొచ్చి
నీకిస్త!
నడుంగట్టు మరోసారి కొట్లాటకు!!'

'బిడ్డా
నేను పెద్దదాన్ని పేదదాన్ని
కండ్లు సరిగ్గ కనబడకపోయిన
నిన్ను గుర్తుపట్టిన
చెవులు యినరాకపోయిన
నీ గొంతు నాకెరికె
యీ తల్లి యిన్ని దినాలకు
యాదికొచ్చినాది కొడుకా

గట్లేకానీ
యీ భూమ్మీద
నీదే రాజ్యం కానీ
పరాయోడి కంటె
సొంతింటోడు నయమే కద

ఒక్కటడుగుత కొడుకా
నీకు నా దుక్కం తెలుసా నా కడుపుకోత తెలుసా
యేండ్ల నుండి నా రెక్కల కష్టం తెలుసా
యెండిపోయిన నా కండ్ల బావులు తెలుసా
నా వుసురు తెలుసా
ముసురుపట్టిన నా మనసు తెలుసా

కానీ కొడుక
అట్లే కానీ

పదిలంగ వుండు కొడుక
గట్టిగ కొట్లాడు
నియ్యతుగ నిలబడు

మన నీళ్ళు మనం తాగి
మన బువ్వ మనం తిని

మన పాట మన మాట
మనం తలెత్తుకుని తిరిగె
మన రాజ్యం తే కొడుక

బిడ్డ
ఒక్క ముచ్చట

నేను పెద్దదాన్నయిన పట్టుదల పోలె
కండ్లు కనబడకపోయిన ద్రుష్టి మందం కాలే
వయసు మీదబడ్డ కొట్లాడె హుజం తగ్గలె
పెయ్యంత పుండయిన ప్రశ్నించె వోపిక తగ్గలె

మునుపటికి నీ అసుంటోల్లు మస్తుమంది వచ్చిండ్రు
నా బిడ్డల నోట్ల నా నోట్ల మట్టిగొట్టి
మూటలు గట్టుక పోయిండ్రు


మేము మునుపటి లెక్క
యేమి తెల్వనోల్లం గాదు

యేండ్లుగ దొరల రాజ్యం
పాలల్ల యిసమూ నీల్లల్ల నెత్తురూ కలిపిన
మా బతుకులు
మాకు ఊపిరి తీసుకున్నట్టె కొట్లాట గూడ నేర్పినయి.

నువ్వు మనందరికోసం నిలబడితె పానమిస్తం

గట్టెక్కినంక నీ తొవ్వ నువ్వె జూసుకుని
మా నెత్తుల మీద చేతులు పెడితె
పానంతోటె పాతరేస్తం!’

తెలంగాణ కోసం ఉద్యమం షురువయినప్పుడు




చిన్నారి మొక్క

కొన్ని యేండ్ల కింద
కొత్తగా విమానమెక్కి
సముద్రాల్ని దాటేటప్పుడు
తోడుగా వుండేందుకు

చిన్న చెయ్యిసంచిలో
వొక చిన్నారి పూలమొక్కనూ
వొక సీతాకోకచిలుకనూ
వెంబడి తెచ్చుకున్నా

మట్టివేళ్ళతో ఆపేక్షల తడినీ
పచ్చని ఆకుల్లో పిల్లగాలుల హొయలునీ
మెత్తని సీతాకోకచిలుక రెక్కల్లో
యవ్వనపు గరుకుదనాన్నీ
పూలరెమ్మల ఎరుపుదనంలో
మా వూరి విశ్వాసాన్నీ
వెంట తెచ్చుకున్నా

నాతోటి
దేశాలు దాటి వచ్చిన



మా వూరి మొక్కను
యెక్కడ నాటాలో తెలియక
నాలోనే
తలకిందులుగా
నాటుకున్నా

తలలోంచి బయటకు పెరిగిన
వేళ్ళు
భూమినీ ఆకాశాన్నీ
వొక్కటి చేసే ప్రయత్నం చేస్తున్నయి

కండరాల్లోకి కాండమూ
నెత్తురులోకి పూల ఎరుపుదనమూ
చొచ్చుకుపోయి
శరీరమంతా వ్యాపించింది
నా చిన్నారి మొక్క

వెంట వచ్చిన సీతాకోకచిలుక
నా తల చుట్టే తిరుగుతూ
చెంపల మీద పసిడిరెక్కలతో
సుతిమెత్తగా నిమురుతోంది

యెటు చూసినా నాలోపల
నక్షత్రాల్లా విత్తనాలు
మిలమిలలాడుతూ
గలగలా నవ్వుతున్నయి

ఇంక ఇప్పుడు
సన్నగిల్లుతున్న నమ్మకాలకు
ధీముగా
ప్రపంచమంతా
మా వూళ్ళను నాటొచ్చు

లోపలా... బయటా...

వుధృతంగా
వాన
కురుస్తున్న చప్పుడు

గాయపడ్డ పక్షి రెక్కల్లా
కిటికీ తలుపులు
కొట్టుకుంటున్నయి.

ఆగి ఆగి నీటిజల్లు
ముఖాన్ని
ఆదుర్దాగా తడుముతూ
ముద్దు పెట్టుకుంటూంది.

ఎడతెరిపి లేకుండా
తల్లడిల్లుతున్న
కిటికీని
సముదాయిద్దామని పోయిన.

బయట వొక్క చినుకూ లేదు!
నిశ్చలంగా తలుపులు.
మౌనంగా తలూపుతున్న పరదాలు.

ఇంకా ఉధృతమౌతున్న
వాన చప్పుడు.

లోలోపల...

సగం కాలిపోయిన
ఇళ్ళ మొండిగోడల మధ్య

వొక్క నీటిచుక్క కోసం
యేళ్ళ నుండీ
నోరు తెరిచిన బీళ్ళ మధ్య

అసంఖ్యాక సుపరిచిత కంఠస్వరాలు
సజీవులవీ, అమరులవీ

ఒక్కోసారి అనేకంగా
పలుమార్లు ఒక్కటిగా

నిరంతరంగా వర్షిస్తున్న ప్రతిధ్వని.

వేనవేల జెండాలు రెపరెపలాడుతున్న హోరు.

గాయపడి తిరిగి లేచిన
పక్షి రెక్కల్లా
నా కనురెప్పలు కొట్టుకుంటున్న
చప్పుడు
మరింత వుధృతంగా
వినబడుతోంది.

FALL

చెంపల మీద
ఈదురుగాలుల ముద్దులతో
సన్నసన్నగా కోస్తూ
ఆకురాలు కాలం వచ్చేసింది.

కొండల తలల మీద
వృద్ధాప్యమై
అడవులని మండిస్తూ
ఆకురాలు కాలం వచ్చేసింది.

మనకన్నా ముందే
త్వరత్వరగా ఇంటికి చేరిపోయే
సాయంత్రాల చలి చీకటిపిట్టలా
ఆకురాలు కాలం వచ్చేసింది,

వణుకుతున్న
భూమితల్లి వంటి మీద
రంగు రంగుల దుప్పట్లు

దయతో కప్పుతూ
ఆకురాలు కాలం వచ్చేసింది.

మరణశయ్యపై నున్న
సూర్యుడి
చిట్టచివరి ప్రేమలేఖై
ఆకురాలు కాలం
విషాదంగా తేలిపోతోంది.

రెక్కల మీద ముత్యాలు
పొదుగుకుని
పక్షులు పాడే
సామూహిక వీడ్కోలు గీతమై
ఆకురాలు కాలం
గాద్గదికమౌతుంది.

చిటారుకొమ్మమీంచి
రాలిపోయే చిట్టచివరి ఆకుల
వెచ్చని ఊపిరిని
ఆకురాలు కాలం
ఆర్తిగా స్పృశిస్తుంది.

చిగుళ్ళని నెత్తురులో దాచుకున్న
మొండిచేతుల చెట్ల
ఆత్మవిశ్వాసాన్ని
ఆకురాలు కాలం
నిటారుగా నిలబెడుతుంది.

కంటి నిండా...

ఏది కోల్పోయామో
అది ఒక
జీవితకాల వాంఛా దుఃఖం

మన జీవితం నిండా దొరికే దుఃఖం
ఎన్నటికీ తీరని
ఆశ

ఆశల్ని కోల్పోయి
వ్యథల్ని ఆహ్వానిస్తామో

వాంఛలని కౌగలించుకుని
జీవితాన్ని కొనుక్కుంటామో...

దహించాలి
ఆశలో దుఃఖపు కన్నీళ్ళనీ
స్వప్నంలో వాంఛా దుఃఖాన్నీ
నిలువునా దగ్ధం చేయాలి

వేదనలేని రేపటిని
పుష్పించే స్వప్నాన్ని

వ్యథారహిత క్షణాల్ని
ప్రేమించే కొత్త ఆశల్నీ

కంటి నిండా దుఃఖించాలి

ఒక కాలంలో, ఒక స్థలంలో...

కాలమయి ఘనీభవించిన
కనుపాపల చీకటి వెలుగుల్లో
ఇగిరిపోయిన దుఃఖ వీచిక

స్థలమయి ప్రవహించిన
మౌన సంభాషణల ముఖ ఫలకమ్మీద
శిలాజమయిన నిట్టూర్పు సెగ

మంచుతో కప్పబడిన
శిథిల పత్రాల క్రీనీడల్లో
పలకరించే
చిరపరిచిత ముఖాలు

ముసలితనం ముసిరిన
చెట్లగాజు కొమ్మలపైన
పుటుక్కున విరిగే
ఆశల కిరణాలు

వెలుతురు సోకని
మంచుగుహల్లో సమాధి అయిన
ఇంద్రధనుస్సు కలలు

కాలిపోయిన ఆకాశం చితిలో
మిగిలిన నక్షత్రాల అవశేషాలు
గతించిన దోషాలు

చావుబ్రతుకుల
చిట్టచివరి అంచు మీద
మెరిసే పొడుగాటి శత్రువు నీడల్లో
పొగచూరిన దిక్సూచులు

చలనరాహిత్యంలోకి వడివడిగా
పరిగెత్తే సామూహిక ఊరేగింపు దృశ్యాలు

ఎన్నడూ ఆరంభం కాని ప్రయాణపు
ప్రాచీన జ్ఞాపకాల పేటికల్లో
రెపరెపలాడే నెమలికన్ను
గమ్యం

అప్పటి మాట కోసం...

కాల్చేసిన వంతెనలు
దాటాల్సిన
అగాధాల్ని గుర్తు చేస్తాయి.

కాలదన్నుకున్న సంబంధాలు
కోల్పోయిన జీవితమై
వెంటాడుతాయి.

జీవం రాల్చేసుకున్న
ఎముకల చెట్టు కింద
ఒంటరితనం తచ్చాడుతుంది.

డాలర్లు పండిస్తున్న
చేతుల్లో
వెచ్చదనమేదీ?

సుఖాలు విలసిల్లే
భోగభూమిలో
తొలకరికి పరవశించే
మట్టి పరిమళమేదీ?

గుండె చూరు నుండి
వేళ్ళాడే మంచుకడ్డీలతో
యుగాల్ని కొలుస్తున్నాను.

చిట్లిపోయిన స్ఫటిక ముఖాల్లో
నెలవంక చిరునవ్వులేవీ?

నడువ వీల్లేని రోడ్ల మీద
కప్పుకున్న దీర్ఘరాత్రుల శీతలత్వాన్ని
ఎన్ని సుదూర ప్రయాణాలు ఛేదించగలవు?

గమ్యం కోసం పరితపించే
మాట కోసం వెతుకుతున్నాను.

నిద్రలో వత్తిగిలినప్పుడు
పగిలిన కలల పెంకులు
గుచ్చుకుంటాయి.

చుట్టూ శబ్దమయ ప్రపంచమే...
అర్థమయ్యే మాటలుండవు!

ఒక ప్రాచీన నిశ్శబ్దం కోసం పరితపిస్తున్నాను!

ఫెటిల్లున పగిలే
ఒక నిశ్శబ్ద నీటిబిందువు కోసం
ఆకాశం వంక ఆశగా చూస్తున్నాను.

అనాది ఆగ్రహాన్ని వర్షించే
ఒక అఖండ వర్షధార కోసం
దోసిలి చాస్తున్నాను.

బూడిద కుప్పల్లోంచి
కాంక్షలని
వెలికి తీసే
కాటికాపరిని ఎలుగెత్తి పిలుస్తున్నాను.

జీవధ్వని లేని హోరు మధ్య
ఆకలి ప్రతిధ్వనించే
ఏక్‌తార కావాలి నాకు!

అగాధాల్ని గుర్తు చేసే
కాలిన వంతెనల చివరి
ఆనవాళ్ళు కావాలి!!

కలయిక

ఇన్నాళ్ళ ఎడబాటు తర్వాత
మనం మళ్ళీ
ఒంటరిగా కూర్చుని
పాత నోటుబుక్కుల్లోంచి
ఎండిపోయిన ఆకుల్ని
ఒకటొకటిగా బయటకు తీస్తాం.

దశాబ్దానంతర కరచాలనంలో
డాలర్ గరగరలు
కర్కశంగా తగులుతాయి.

పేర్చుకున్న రంగు కాగితాల నుండి
దుఃఖపు పొరల పెళుసులు
పర్చుకున్న శూన్యంలోకి
రాలిపడుతుంటాయి.

ఇప్పుడు
ఇన్ని యుగాల దూరంలో
మన రెండు ఒంటరి ప్రపంచాల్లో

దోసిళ్ళ కొద్దీ
గతాన్ని
మళ్ళీ
కలబోసుకోగలమా?

బిగపట్టుకున్న
వెక్కిళ్ళనాపి
ఎగసిపడే
ఎర్రజీరల్ని
యదేచ్ఛగా
విరబూయగలమా?

దుర్భేద్యమైన గాజుగోడల మధ్య నిలబడి
ఎంత దగ్గరగా మాట్లాడుకున్నా
ఒకరి మౌనం ఒకరికి అర్థం కాదు.

ఎన్ని ఎడతెగని పగళ్ళ చీకటిలో దేవులాడుకున్నా
ఒకరి చూపు ఒకరికి కనబడదు.

దుమ్ము పట్టిపోయిన గ్యాపకాల తోటలో
ఒక్క పువ్వునూ పోల్చుకోలేం.

మైళ్ళకొద్దీ
నడిచిన తొవ్వలో
ఒక్క గులకరాయినీ
స్వంతం చేసుకోలేం.

యిన్నేండ్ల మన ఆత్మీయత
రెండు కన్నీటి చుక్కలుగానైనా
ఘనీభవించలేదు.

ఇంతకూ
ఇన్నేళ్ళ తర్వాత కలుసుకుని
ఏ గాయాల గూర్చి మాట్లాడుకుంటున్నామో
ఏ నెత్తుటి మరకలని తడుముకుంటున్నామో
ఏ కన్నీటి చారికల్ని వెతుక్కుంటున్నామో

డాలర్ గుణింతపు లెక్కల మధ్య
ఎప్పటికైనా
అస్పష్టంగానైనా
మనకు అర్థం అవుతుందంటావా!

మెలకువ కల

నిద్ర లాంటి
మెలకువ స్థితిలో
మేలుకుని కలగన్న
ఒక నిద్రాగతి

తెగిపోయిన
రెండు తీగల మధ్య
జన్మించక ముందే
కొన వూపిరితో
రాగం...

పగిలి అతుక్కున్న
గాజుకళ్ళలో
వెనక్కీ ముందుకీ
పరుగెత్తే
సరళ కాలరేఖ

పొడుగాటి రెండు
రాత్రుల మధ్య
కుంచించుకున్న పగలు

తేలుతున్న
చీకటిలో
మునిగి వూపిరాడక
వెలుతురు

వేయకుండానే
జారిపోయే
అడుగులు

మోయకుండానే
కుంగిపోయే
భుజాలు

మెలకువలాంటి
నిద్రలో
నిరంతరం
చలించే
నిశ్చల సమాధి స్థితి

వేలి చివరన
చుట్టుకున్న
తీగకు
అంటుకున్న
స్వరం

తల మీద
చెయ్యి వేసి
నిమిరిన కొద్దీ
పైకెగసే
అలలు

తడిసినకొద్దీ
ఆరిపోని తడిలో
చిదిమిన కొద్దీ
తిరిగి ఎదిగే
కంటి మొగ్గ

కలల్లేనితనం

ఒక గొప్ప ప్రారంభం కోసం
అన్వేషణ
పేలవమైన ముగింపుగా
కొట్టుమిట్టాడుతుంది

వేయి తుపాకుల ముందు కూడా
తలవంచని ధైర్యం
తోవ తెలియనితనంతో
నీరుకారిపోతుంది.

తుపాను ప్రచండతను
ఊపిరిగా పీల్చిన యవ్వనం
పత్రహరితం పరాధీనమై
చిరుగాలులకు సైతం
కంపించిపోతుంది.

వాగునీటి గలగలల
పరిమళాలు వెదజల్లిన

వెన్నెల రాత్రుల అమాయకత్వం
విచ్చుకత్తులు దూసిన పేటెంట్ల మధ్య
అస్తిత్వం కోల్పోతుంది.

కొత్త ఆకాశాల కోసం
అరమోడ్పు కళ్ళతో తపించిన
నెలవంక
కలల్లేనితనంలో వెలవెలపోతుంది.

భవిష్యత్తుపై
ప్రేమతో
వర్తమానాన్ని ధిక్కరించిన
ఆకాంక్ష
చరిత్ర చీకటినీడల్లో
గతం కన్నీటిమరకగా
మిగిలిపోతుంది.

ప్రతి మజిలీ దగ్గర
చౌరస్తా అయిపోయిన ప్రయాణం
తిరిగి తిరిగి ప్రారంభానికే
చేరిపోతుంది.

అపరిచితం

కలలధూళి ఎగిసి
కన్నీరు గరగరలాడకుండా
నల్లని రే-బాన్ గ్లాసెస్ పెట్టొచ్చు

రాత్రి
నిద్రలేమి కత్తులై కోయకుండా
ఎలక్ట్రిక్ హీటర్లలో
మొహం దాచుకోవచ్చు

గాయాల మరకలు చిట్లి
నెత్తురు పూయకుండా
రంగు రంగుల బొకేలు కప్పవచ్చు

విషాదం ముడుతల మీద
వెలుతురు పడకుండా
వెనీషియన్ బ్లైండ్స్
సగం మాత్రమే తెరిచి వుంచవచ్చు

సంభాషణల్లోని
లోతైన శూన్యం వినబడకుండా
ఖాళీసీసాలని
క్షణాలుగా దొర్లించవచ్చు

తుప్పుపట్టిన సహజాతాలు
పెళుసులీనకుండా
ఖరీదైన పెయింట్లతో
తళతళా మెరిపించవచ్చు

కలయికల్లోని
కృత్రిమత్వాన్ని
సన్నిహితత్వంలోని
చల్లదనాన్ని
మర్యాద మెరుపుల జిగేళ్ళ మధ్య
మరిచిపోవచ్చు

అద్దం ముందు నిలబడ్డప్పుడల్లా
వెక్కిరించే అపరిచిత ముఖాన్ని
గడ్డీగాదం డాలర్లూ కూర్చి
ఇంటి ముందు ఆర్భాటంగా నిలబెట్టి
శేషజీవితాన్ని మురిపెంగా గడపొచ్చు!

వేకువ-సంధ్య

చెప్పలేని
దిగులు వ్యధతో
చలిని కప్పుకు వణికిన
ఒక ఎండు చేతుల రాత్రి-

ఎర్రెర్రగా తొంగిచూస్తున్న
చెట్ల చిగుళ్ళ చిరునవ్వులను
కాలాన్ని వెనక్కి జరిపి
కౌగలించుకుంటుంది

మంచు మైదానమై
పరుచుకున్న
శిశిర చీకటిలోంచి
ఒక ఆకుపచ్చని గడ్డిపూల మొక్క-

బంగారు రెమ్మల కళ్ళతో
తొట్టతొలి కిరణాన్ని
ముద్దాడుతుంది

క్రూరమైన దినచర్యలో
ఒళ్ళంతా కమిలిన
ఆకాశం-

తళుక్కున వేళ్ళాడే
నెలవంక చిర్నవ్వుని
ఆప్యాయంగా అక్కున
చేర్చుకుంటుంది

వెన్నెలరజనుతో మెరిసే
ఒక స్వేచ్ఛా సాయంకాలం

వళ్ళు విరుచుకుంటున్న
వేకువతో
కరచాలనం చేస్తుంది

పూడుకుపోయిన గొంతుల
మౌన సంభాషణలని

బరువెక్కిన గడియారం
ముండ్ల గుసగుసలు మోస్తాయి

తడి ఆరని మెరిసే కళ్ళని
కలిపేందుకు

ఆకాశం చుక్కల చాపలా
చుట్టుకుంటుంది

సాయంత్రంలో మునిగిపోయే పగలూ
ఉదయమై ఎగిసిపోయే రాత్రీ-

జీవితం పరిమళించే
ఒక కొత్త రోజుగా
విచ్చుకుంటూ...

అమ్మకు...

నాకు తెలుసును
అమ్మా!
నేను నిన్ను మోసం చేసాను
నీ హృదయపు లోలోతుల్లో-

నేనింకా
నీ కళ్ళలో గాఢంగా
నిద్రపోతున్న శిశువును కాను.

నువ్వేమో
కరుకైన చల్లదనం మాత్రమే శాశ్వతం కాని
పక్కలుంటాయనీ

రాత్రులు
ఉదయపునీటితో
ప్రతిధ్వనిస్తాయనీ
తెలుసుకోకూడదనుకున్నావు.

అందుకనే
అప్పుడప్పుడు
నేన్నీతో చెప్పే మాటలు
కటువుగానే వుంటాయి.

అమ్మా
మన ప్రేమలో
సంతోషమూ వుండదు.

నిజమేనమ్మా
మన ఫోటోఫ్రేములో
నా హృదయానికి హత్తుకున్న
ఆ తెల్ల గులాబీలు పోగొట్టుకున్నాను.

ఆ గులాబీలను
నేనింకా ఎంత ప్రేమిస్తున్నానో
నీకు తెలిస్తే
నీ క్షణాలని పీడకలలతో నింపుకోవు.

కానీ అమ్మా!
నువ్వు చాలా విషయాలు మరిచిపోయావు.
నా కాళ్ళు బాగా పొడుగ్గా పెరిగాయనీ,
శరీరమూ పెరిగిపోయిందనీ;
నా హృదయం కూడా బాగా పెద్దదైపోయింది
అమ్మా!

చూడమ్మా! నువ్వో మాట వినవూ?

అప్పుడప్పుడూ
నేనింకా
నీ కళ్ళలో నిద్రపోయిన పసివాడినే!

మన ఫోటోఫ్రేములో వున్నటువంటివే
తెల్లగులాబీలను
నా హృదయానికింకా
హత్తుకునే వున్నాను.

'అనగనగా ఓ రాజు...'
అంటూ నిద్రపుచ్చే
నీ స్వరమూ గుర్తుంది.

కానీ నీకు తెలుసు-
రాత్రి విశాలమైంది,
నా శరీరం పెరిగిపోయింది.
నేనా ఫోటోఫ్రేమునొదిలి
నా కళ్ళను
పక్షులకు తాగడానికిచ్చాను.

నేనేదీ మర్చిపోలేదమ్మా!
నీ స్వరాన్ని నాలో పదిలపరుచుకున్నాను.
గులాబీలను నీకోసం వదిలి వెళ్ళాను.

అమ్మా!
గుడ్‌నైట్!!

నేను పక్షులతో వెళ్ళిపోతున్నాను!

మూలం: యూజీనియో ది అంద్రాదే (పోర్చుగీసు కవి)

పునరాహ్వానం

కె. శివారెడ్డి

Diaspora: 1. Scattering of the Jews to the countries outside of Palastine after the Babylonian captivity.
2. The body of Jews living in such countries.

The Random House Dictionary

Diaspora: 1. The Movement of own Jewish people away from their own country to live and work in other countries.
2. The Movement of people from any nation or group away from their own country.

Oxford Advanced Learner's Dictionary

Diaspora మాట గత దశాబ్దం నుంచి బాగా ప్రచారంలోకి వచ్చింది. సామ్రాజ్య వాద సాంస్కృతిక దాడులు ఉధృతమౌతున్న నేపథ్యంలో ఆధునికానంతర భావజాలం విరివిగా ప్రచారం పొందుతున్న నేపథ్యంలో- అస్తిత్వానికి సంబంధించిన అనేక ప్రశ్నలు ముందుకొస్తున్న సామాజిక సందర్భంలో వ్యక్తి స్వేచ్ఛ పేర సామూహిక అనుభవాన్ని ఒక రకంగా చిన్నచూపు చూసే సమయంలో- ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆర్థిక స్థితిగతుల్నీ, సాంస్కృతిక స్థితుల్నీ తలకిందులు, తారుమారుచేసే తరుణంలో- నిన్న చర్చకు రాని చాలా విషయాలు నేడు చర్చకొస్తున్నాయి. వెలుగు చూస్తున్నాయి.

విలువలు కొత్త నిర్వచనాన్ని పొందటమో, అంతరించటమో జరుగుతున్న సమయం.

ఒక యూదుకే కాదు, పై చదువులు చదువుకొని ఉద్యోగార్థం ఇతర దేశాల్లో స్థిరపడిన వాళ్ళూ, తాత్కాలికంగా ఉంటున్నవాళ్ళు పొందుతున్న అనుభవం నుంచి, ఘర్షణ నుంచి, డోలాయమాన స్థితి నుంచీ వస్తున్న సాహిత్యం వుంది. మాతృదేశానికి దూరమై, తను పుట్టి పెరిగిన గ్రామానికి, ప్రజలకు దూరమై కొత్త దేశంలో, కొత్త ప్రాంతంలో భిన్న సాంస్కృతిక నేపథ్యం గల బృందాల మధ్య, గ్రూపుల మధ్య జీవిస్తున్నప్పుడు పొందే ఒక అనుభవం వుంది. ఒక uprootedness నుంచి మాట్లాడే విధానముంది. స్వదేశంలో జైళ్ళలో వున్నవాళ్ళ అనుభవం ఒక రకం. అది కూడా సమూహం నుంచి ఖండించబడి పరిమితమైన స్థలకాలాల్లో బతకటం నుంచి వచ్చే వేదన, దుఃఖం- ఒకరకంగా విడమర్చి చెప్పలేని బాధ, ఒంటరితనం- జైల్లో వున్నవాళ్ళు కల్చరల్‌గా out cast కారు. కానీ విదేశాల్లో నివసిస్తున్న వాళ్ళు అదనంగా పొందే ఎగోనీ ఒక కల్చరల్ ఔట్‌కాస్ట్ కూడా. ఆర్థిక స్థితిగతులు బాగానే ఉంటాయి. సుఖంగా వున్నట్టు వుంటుంది. కానీ ఎవడికి వాడు ఐలాండ్‌గా పరిణమిస్తున్న దశ. దగ్గరగా వున్నా యిద్దరి మధ్య యోజనాల దూరమున్నట్టు- కుటుంబాలకి కుటుంబాలు ఏకాకితనానికి గురయ్యే, ఆంతరంగిక forlorness కి గురయ్యి క్షోభ ననుభవించే సందర్భాలు.

ఈ నేపథ్యం నుంచి చాలా సాహిత్యం వచ్చింది అన్ని ప్రక్రియల్లోనూ. ఒక అనుభవం భౌగోళికమై, భౌతికమై, మానసికమౌతుంది. డయాస్పోరాలో నాస్టాల్జియా ఒక భాగం.

స్వామి గత ఎనిమిదేళ్ళుగా అమెరికాలో వుంటున్నాడు. అమెరికా వెళ్ళక ముందే ఒక కవితాసంపుటి ప్రచురించాడు. దాని పేరు కల్లోల కలల మేఘం. 14 సంవత్సరాల క్రిందట వచ్చింది. ఒక మనిషి జీవితంలో, ముఖ్యంగా ఒక కవి జీవితంలో ఒక దశాబ్దిన్నర మామూలు సమయం కాదు. ఈ ఎనిమిదేళ్ళ నుంచి తాను లోనైన సంక్షోభం నుంచి, వత్తిడి నుంచి, డైలమా నుంచి, ఆత్మవిమర్శ నుంచీ వచ్చిన కవిత్వం వుంది. ఈ సంపుటి పేరు 'సందుక.' కవితా సంపుటుల పేర్లే చెబుతాయి వాటి నేపథ్యం, వాటి అంతర్లీన వస్తువు.

స్వామి విరసం సభ్యుడు. ఇప్పుడవునో కాదో నాకు తెలియదు. ఒక వామపక్ష భావజాలంతో, నిబద్ధుడై పనిచేసి రాసిన కవి. దందహ్యమాన దశాబ్దం ప్రొడక్ట్ స్వామి. ఒక కల్లోల సంక్షోభ సమరశీల సందర్భంలో జన్మించిన కవి. పదునైన కవి. చురుకైన కవి. ఊహా శాలిత్వం పుష్కలంగా ఉన్న కవి. ఆవేశం, ఆవేదన, కాల్పనికత తగు పాళ్ళలో కలగలిసిన కవి. నిజానికి స్వామికి పరిచయం అక్కర లేదు. కల్లోల కలల మేఘం తర్వాత బ్రేక్ రాకపోతే, ఈపాటికి కనీసం నాలుగు కవితా సంపుటాలు అచ్చేసి వుండేవాడు. చకచకా మారిపోతున్న పరిస్థితి, వేగవంతమైన జీవితం- కనీసం రెండు కొత్త తరాలు రంగం మీదికొచ్చాయి. వస్తువు

మారింది, సందర్భం మారింది, కవిత్వ రూపురేఖలు మారాయి. ప్రతి అయిదేళ్ళకు మారే వస్తురూపాలతో కవిత్వం ముందుకెడుతున్నప్పుడు గాప్ ప్రమాదకారి. అయితే స్వామి సచేతనుడైన కవి. గాప్ వచ్చినా తనలోని కవిని బతికించు కొన్నాడు. నూతన జీవనస్థితి నుంచి, కొత్త కవిత్వంతో మనముందు కొచ్చాడు. స్వామి లాంటి నిబద్ధకవికి రెండు పార్శ్వాలుంటాయి. ఒకటి తన వైదేశిక నేపథ్యం నుంచి పలకాలి. రెండు స్వదేశంలో, స్వరాష్ట్రంలో జరుగుతున్న మార్పుల్నీ గమనించాలి. అనుభవించి కవిత్వీకరించాలి. ఆ పనీ స్వామి చేశాడు. జీవితం దయలేనిది. దయలేని జీవితంలో దయనీ, హింసాపూరిత సమాజంలో కరుణనీ నింపే బాధ్యత కవిది. ప్రధానంగా రెండు స్థితుల్నుంచేకాక, అనేక కోణాల్నుంచి మృదువైన, లలితమైన పార్శ్వం నుంచీ పలికిన కవితలున్నాయి.

జీవం రాల్చేసుకొన్న
ఎముకల చెట్టుకింద
ఒంటరితనం తచ్చాడుతుంది

డాలర్లు పండిస్తున్న
చేతుల్లో
వెచ్చదనమేదీ?

సుఖాలు విలసిల్లే
భోగభూమిలో
తొలకరికి పరవశించే
మట్టిపరిమళమేదీ?

గుండె చూరు నుండి
వేళ్ళాడే మంచుకడ్డీలతో
యుగాల్ని కొలుస్తున్నాను

అప్పటి మాటకోసం అన్న ఈ కవిత ధ్వనిస్తున్నదేమిటి?

అపరిచితం పేరుతో మరో కవిత వుంది.

కలల ధూళి ఎగిసి
కన్నీరు గరగరలాడకుండా
నల్లని రేబాన్ గ్లాసెస్ పెట్టొచ్చు-

కలలు కలల్లోని
కృత్రిమత్వాన్ని
సన్నిహితత్వంలోని
చల్లదనాన్ని
మర్యాద మెరుపు జిగేళ్ళ మధ్య-

అద్దం ముందు నిలబడ్డప్పుడల్లా
వెక్కిరించే అపరిచిత ముఖాన్ని
గడ్డీగాదం డాలర్లు కుట్టి
ఇంటి ముందు ఆర్భాటంగా నిలబెట్టి
శేష జీవితాన్ని మురిపెంగా గడపొచ్చు

అవ్వ అనే కవితలో అవ్వ అడుగుతుంది-

'మీరున్న జాగల మంచిగుంటద కొడుకా'

యెంత మంచిగున్నా
బిడ్డల కోసం పానమిచ్చి
యెప్పుడు గూట్లె కొస్తరోనని
దినామూ రాత్రీ
కండ్లల్ల వత్తులేసుకొని తల్లడిల్లే
నీ అసుంటి ఆత్మగల తల్లుల్లేరు

అని సమాధానం. గాల్లో ఎగిరాక కానీ అనే ఇంకో కవితలో...

చుట్టూ స్పృశించలేని
నీలిపొర
దిగులుగా వ్యాపిస్తేగానీ-
మనది కాని
ఒక శబ్ద ప్రపంచం
మన భాష అయ్యాక-
పోగొట్టుకున్న
పలకరింపుల ఆర్తి వెనక
అనుబంధాల గాఢతికత వినబడదు

'మనదికానిదేదో' ఎప్పుడూ వెంటాడుతూ వుంటుంది. అంతా మనది కానిదే చుట్టూ ఆవరించినప్పుడు, మనిషి పడే ఆవేదన, ఆర్తి, దుఃఖం- ఇవన్నీ కలగలిపితే ఒకే ఒక్క మాట అది, 'దిగులు'. దిగులు ఎప్పుడూ అంటిపెట్టుకొని వుంటుంది. నవ్వుతూ తుళ్ళింత లాడుతున్నప్పుడూ, ఇంట్లోనూ, వీధిలోనూ, ఆఫీసులోనూ

అంతటా దిగులు. తన ఊరికీ, తన వాళ్ళకీ, తనదైన ప్రతిదానికీ దూరమయినప్పుడు ఆవహించే దిగులు. ఒక విషాదపు గాలి. అప్పుడర్థమౌతుంది. నాటకం కొత్త అంకం మొదలయిందని.

దుమ్ముపట్టిన డైనింగ్ టేబుల్‌కి
అవతల పక్క నువ్వూ, ఇవతలపక్క నేనూ
ఇద్దరి మధ్యా ఒక గతమూ, ఒక భవిష్యత్తూ
ఒక అర్ధ భూగోళం

అప్పుడప్పుడు
కనుకొలకుల్లో
ఒక నిప్పుకణిక ఉబుకుతుంది

ఎందుకు నిప్పుకణిక ఉబకటం. అర్థమయీ కానట్టు ఉన్న ఒక స్థితి. ఎప్పుడు మొదలవుతుందో తెలియని తోలుబొమ్మలాట.

తనున్న స్థితిని అద్భుతంగా పట్టిచ్చే కవిత- లోపలా బయటా

ఉధృతంగా
వాన
కురుస్తున్న చప్పుడు

అని మొదలైన కవిత-

గాయపడ్డ పక్షిరెక్కల్లా
కిటికీ తలుపులు
కొట్టుకుంటున్నాయి
కిటికీని సముదాయిద్దామని పోయిన
కానీ,
బయట ఒక్క చినుకూ లేదు-
ఇంకా
ఉధృతమౌతున్న
వాన చప్పుడు- లోలోపల-
గాయపడి తిరిగి లేచిన
పక్షిరెక్కల్లా
నా కనురెప్పలు కొట్టుకొంటున్న చప్పుడు

ఒక విషాదాంత నాటకం చూశాక కలిగే అనుభూతి ఈ కవిత ఇస్తుంది. ఒక ట్రాజిక్ క్లైమేట్ అల్లుకొన్న స్థితి.

డాలర్ గుణింతపు లెక్కల అధికార పొరల మధ్య
ఎప్పటికైనా అస్పష్టంగానైనా
మనకు అర్థమౌతుందంటావా-

చెప్పలేని దిగులు వ్యధలో
చలిని కప్పుకు వణికిన
ఒక ఎండు చేతుల రాత్రి

ఒక ఆశ వుంటుంది, ఒక క్రోధం వుంటుంది, ఒక నిస్సహాయ స్థితి వుంటుంది. ఒక సంశయం, ఒక దిగులు- అన్ని భావనలు కలగలిసి అల్లుకుపోయిన స్థితి.

ఒక గొప్ప ప్రారంభం కోసం
అన్వేషణ
పేలవమైన ముగింపుగా
కొట్టుమిట్టాడుతుంది
వేయి తుపాకుల ముందు కూడా
తలవంచని ధైర్యం
తోవ తెలియనితనంతో
నీరుకారిపోతుంది

వేళ్ళు తెగిపోతున్న ఒక భావన. గాల్లో తేలియాడుతున్న భూమ్యాకర్షణ లేనితనం, దేనికీ చెందనితనం. అటు స్వదేశానికీ, ఇటు విదేశానికీ, దేన్నీ వదులుకోలేని ఒక డోలా యమాన స్థితి. దూరాన ఉన్నా ఇంటి మీద గాలి. సందుకని స్పృశించి గతానుభవాన్ని పునః అనుభవంలోకి తెచ్చుకోవటం, వెనక్కి తిరిగి చూసుకొనే కొలదీ, వర్తమానం డొల్లతనం, పరాధీనత గుర్తుకు రావటం- ఒక endless pain, agony, heart aching.

అందుకే ఇన్నాళ్ళ తర్వాత కూడా స్వామి కవిత్వాన్ని వదల్లేదు. అదొక సంజీవని. దివ్యౌషధం. వి.వి. చేతిని తాకినప్పుడు పొందే పునర్జన్మ. ఆశయం, ఆచరణ, కలగలిసిన ఒక గొప్ప ఉజ్వల స్వప్నం ఆయన.

ఆయన ముందు తన్నుతాను డిస్కవర్ చేసుకొన్నట్టుగానే, చాలా కవితల్లో తన్ను తానే కనుక్కుంటానికి పునః నిర్మించుకొంటానికి ప్రయత్నం చేశాడు. సందుక గావచ్చు, అర్ర కావచ్చు, చెరువువేమయ్యింది కావచ్చును. ఈ కవితలన్నింటిలో రెండు దిశల్ని, రెండు పార్శ్వాల్ని, రెండు కోణాల్ని, రెండు అనుభవాల్ని కలిపి

అందుకోవటానికి ప్రయత్నం చేశాడు. తన ప్రాంతంలో జరుగుతున్న పోరాటాల, ఉద్యమాల నేపథ్యంలో ఎత్తుకొన్న కవితలున్నాయి.

అమెరికన్ అనుభవం నుంచి, పరాధీన, పరాయీకరణ నుంచి, గతాన్ని, తన పల్లె జీవనం నుంచి స్మృతిలో పలికిన కవితలూ ఉన్నాయి. లోలకం ఊగుతూ అనుభవిస్తున్న జీవితాన్ని, దాని అనుభవాన్ని లోలోతుకెళ్ళి వ్యక్తీకరించే ప్రయత్నం వుంది.

ఈ కవితలన్నింటినిండా ఒక తడి, ఒక ఆర్తి, ఒక దిగులు అల్లుకుపోతుంది. ఈ సంపుటిలోని కవితలన్నీ చదివాక, మా స్వామి మారలేదు, పాత స్వామే. కుట్రకేసుకు వ్యతిరేకంగా ఊరేగింపు దీస్తే, ఒక అరవైమందిని నిర్బంధిస్తే... చాన్నాళ్ళ కింద, స్వామి రాసిన కవిత ఇప్పటికీ నా చెవుల్లో తిరుగుతూనే వుంది. ఆ కవిత రాసిన స్వామి కంటిన్యూ కావాలి. నిర్బంధం, హింస, అణచివేతని రొటీన్, అలవాటుచేసే ఒక ప్రయత్నం రాజ్యం ఎప్పుడూ చేస్తూనే వుంటుంది. దాన్ని జయించాలి. స్పందననీ, సృజనశీలతని బతికించుకోవాలి. మొద్దుబారే తనాన్ని విడనాడాలి.

ఇంకా లోలోతులకెళ్ళి అమెరికాలో జీవనానుభవాన్ని వ్యక్తీకరించాలి. అక్కడుండి ఆ స్థితి నుంచి ఆ రాజ్యం గురించి ఆ ప్రజ గురించి స్వామి ఏమనుకొంటున్నాడో కూడా తెలియాలి.

పధ్నాలుగేళ్ళ తర్వాత పునఃజన్మించిన స్వామికి అభినందనల ఆహ్వానం.

ఒక వెచ్చని కౌగిలి.

తప్పిపోయిన కొడుకు తిరిగొచ్చాడా?

ఏమో...!

హైదరాబాద్, 2 ఆగస్టు 2006

సందుకలోంచి కొత్త సువాసన

ఎన్. వేణుగోపాల్

మనిషికి జ్ఞాపకం ఒక వరం. ఒక శాపం కూడానేమో. గతం నిరంతరం వర్తమానంతో సంభాషిస్తూ ఉంటుంది. ఆనందాలను, విషాదాలనూ గుర్తు చేస్తూ ఉంటుంది. అప్పటి ఘటనలను ఇప్పటి ఘటనలతో, అప్పటి స్థితిని ఇప్పటి స్థితితో పోల్చి చూపుతూ ఉంటుంది.

మానవ సంబంధాలను, ఉద్వేగాలనూ గతం నుంచి, సుదూరం నుంచి, సమీపం నుంచీ కూడా తవ్వి తీసి, పోలికకు, మెరుగుదలకు, విచ్చిన్నానికీ కూడ అవకాశం ఇచ్చే మేధో వ్యాపారం నిజంగా అబ్బుర పరుస్తుంది. ఒక మాట, ఒక ధ్వని, ఒక వాసన, ఒక దృశ్యం, ఒక స్పర్శ, ఒక సంబంధం- ఒక అనుభవం మరొక అనుభవాన్ని గుర్తు తెస్తుంది. ఒక వరుస అనుభవాల జ్ఞాపకాలను ప్రేరేపిస్తుంది. ఒక జ్ఞాపకం మరెన్నో సంబంధం ఉన్న, సంబంధం లేని, సమీప, సుదూర, సన్నిహిత, పరాయి, ఆత్మీయ, అసహ్య కర జ్ఞాపకాల వెల్లువను తోసుకొచ్చే మీట నొక్కుతుంది. మానవమేధకు ఉన్న సృజనాత్మకత, ఊహాశాలిత, అన్వేషణా శక్తీ, చర్య-ప్రతిచర్యలు ఎంత విస్తృతమైన వంటే ఈ జ్ఞాపకాల వెల్లువ వైశాల్యాన్ని, లోతును, ఉరవడినీ అనుభవించవలసిందే తప్ప తార్కికంగా ఎంత విశ్లేషించినా మిగిలిపోయేది ఉంటూనే ఉంటుంది.

నారాయణస్వామి కవిత్వం చదువుతుంటే ఎప్పటికప్పుడు ఆ సందుకలోంచి కొత్త సువాసనలు వ్యాపిస్తూనే ఉన్నాయి. ఇంతకుముందు ఈ అర్థం గ్రహించలేక పోయానే, ఈ కోణం గుర్తించలేకపోయానే అని అనిపిస్తూనే ఉంది. ఈ సందుక నిండా ఉన్నవి కేవలం కవిత్వం కాదు గనుకనే, నిజజీవితంలోని అనుభవైక వేద్యమైన జ్ఞాపకాలు గనుకనే, అవి కూడ వేలాదిమంది సహచరుల జ్ఞాపకాల

ప్రవాహాలలోని కొన్ని పాయలు గనుకనే సందుక తెరిచినప్పుడల్లా ఈ జలపాత ధ్వని, సముద్రపు హోరు, మహాజన సంరంభం.

ఈ సందుక లోపల రంగుపోయిన పక్షి ఈకలున్నాయి. బంతిపూల రెక్కలున్నాయి. బంగారుపురుగు రెక్కలున్నాయి. తెలంగాణ పల్లెటూరి పిల్లలు చిన్నతనంలో ఆసక్తితో, ప్రేమతో సేకరించి రహస్యంగా దాచుకొనే వస్తువులివి. ఈ సందుకలోనే సగం చినిగిపోయిన కరపత్రాలూ ఉన్నాయి. పెన్సిలు గీతలతో ఊపిరిపోసిన వాక్యాలు, మార్జిన్‌లలో రాసుకొన్న నోట్సులూ ఉన్నాయి. తొలి యవ్వనాల రంగురంగుల ఉద్రేకాలూ ఉన్నాయి. తెలంగాణలో ఎనభైలలో యవ్వనంలో ప్రవేశించిన వేలాదిమంది జ్ఞాపకాల సంపుటులు అవి. కొన్ని సంవత్సరాలో, దశాబ్దాలో గడిచాక ఆ అర్రలోకి ప్రవేశించి ఆ సందుక తెరిచి చూస్తే ముప్పిరిగొంటున్న భావోద్వేగాలున్నాయి. ఇవాళ్టి స్థితి మీద సందేహాలు, పశ్చాత్తాపాలు రేపటికోసం కలలూ ఉన్నాయి.

గత ఏడాదిగానో, ఇంకా అంతకన్న ఎక్కువేనో ఈ కవిత్వం చదివిన ప్రతిసారీ 'గడిచిన దినాల తలపోత బరువుచేత' కళ్ళు చెమ్మగిల్లుతూనే ఉన్నాయి. నాకు పరిచితమైన అర్రలు, సందుకలు, చెరువులూ, వెళ్ళిపోయిన వీరులూ, అప్పుడు తలమునకలయిన అనుభవాలూ గుర్తుకొస్తూనే ఉన్నాయి. బహుశా మా తరంలో చాలామందిని ఈ కవిత్వం ఆ గతం జ్ఞాపకాలలోకి, గత వర్తమానాల సంభాషణలోకి బట్వాడా చేస్తుందనుకొంటాను. ఒకరి జ్ఞాపకాలు మరొకరి జ్ఞాపకాల వెల్లువని ప్రేరేపించగలుగుతున్నాయంటే ఆ జ్ఞాపకాలలో వయ్యక్తిక నిర్దిష్టత ఎంత ఉన్నదో, సామూహిక సాధారణత్వమూ అంత ఉన్నదన్నమాట. పరస్పరం సుదూరంగా, సంబంధం లేకుండా ఉన్నట్టు కనిపించే ఆ రెంటి మధ్య ఐక్యతను, అవిభాజ్యతను ఆ కవిత్వరూప జ్ఞాపకాలు సాధించాయన్న మాట.

ఈ కవిత్వం నాలో రగుల్కొల్పిన, మేల్కొల్పిన జ్ఞాపకాలలో ఒకదాని గురించి చెప్పాలి. అది ఒక పురాస్మృతి. పురాశోకపు స్మృతి.

పల్లెటూరి మనుషులు సాధారణంగా తమ ఆక్రోశంలో, రోదనలో ఏడేడు తరాల జ్ఞాపకాలు తవ్విపోసుకొంటారు. వర్తమానంలోంచి గతంలోకి, గతంలోంచి వర్తమానంలోకి సునాయాసంగా ప్రవహించగలగడం, గత వర్తమానాల మధ్య విభజన రేఖ చెరిపెయ్యగలగడం గ్రామీణ అమాయక నైసర్గిక స్వభావంలో అతి సహజమైన అంశం.

మా రాజవరంలో నా చిన్నతనంలో మా ఇంటి ముందు ఉండే మూడు చాకలి కుటుంబాలలో లచ్చవ్వ అని ఒకామె ఉండేది. ఆమె ఏడ్వని రోజుండేది కాదు. దాదాపు ప్రతి సాయంకాలమూ ఆమె రెండు మూడుగంటల పాటు ఊరదిరిపోయే శోకాలు పెట్టేది. ఆ శోకాల్లో తన పుట్టింటివారి ఏడేడు తరాల జ్ఞాపకాలు

దొర్లేవి. వర్తమానం, గతం అవిభాజ్యంగా కలిసిపోయి ఆమె ఆనాటి కానాడు వచ్చిన కష్టానికి దుఃఖిస్తోందా, ఎప్పటెప్పటివో స్మృతులన్నీ తవ్విపోసుకుంటుందో తెలియని స్థితి కొనసాగేది.

ఏ రోజయినా ఆ ఎడతెగని దుఃఖానికి తక్షణ వర్తమాన సందర్భం ఏదో ఒకటి ఉండేది. పుట్టింటివైపు చుట్టాలు రావడం, భర్త కొట్టడం, ఆ పూటకు తిండి లేకపోవడం, పిల్లలు మాట వినకపోవడం, ఊళ్ళో ఎవరో ఏదో సూటిపోటి మాట అనడం, బట్టల మైల పోలేదని దొర్సాని తిట్టడం - సందర్భం, కారణం ఏదన్నా కానీ, దుఃఖం ఎక్కడన్నా మొదలుకానీ అది అనివార్యంగా గతంలోకి వెళ్ళిపోయేది. అది ఏ క్షణానికా క్షణమే, ఏ శకలానికా శకలమే అనుకొనే పోస్ట్‌మాడర్న్ దుఃఖం కాదు. విషాదమైనా, ఆనందమైనా, కష్టమైనా, సుఖమైనా అసలు జీవితమే ఒంటరి జీవితం కూడ కాదు సామాజిక జీవితమే ఒక నిరంతర ధార అనుకొనే సహజ వివేకపు శోకం అది. ఆ సహజ వివేకపు శోకంలో పురాశోకమూ ఉంది, తక్షణ శోకమూ ఉంది. వర్తమానమూ ఉంది, పురాస్మృతీ ఉంది.

ఇక్కడ నారాయణస్వామి కవిత్వంలో కూడ ఆ పురాస్మృతీ ఉంది, వర్తమానమూ ఉంది. ఇక్కడ ఒక్కచోటికి చేరిన కన్నీటి సరుల దొంతరలను చాలారోజులుగా అనుభవిస్తున్నాను. ఆ భాష్పధారలలోని పదును - తడి, నైశిత్యం అనే రెండు అర్థాలలోను - మనసుకు అంటుతూనే ఉంది. మనసును అంటిస్తూనే ఉంది. అట్లని ఇవి కేవలం నిస్సహాయపు కన్నీళ్ళు కూడ కావు. తలచుకొంటే అది వానలాగనూ అనిపిస్తుంది. వాన వెలిసిన సాయంకాలాలు ఇంద్రధనుస్సులు కూడ దిగంతం మీద మెరుస్తూనే ఉంటాయి.

ఆ జ్ఞాపకాలను, వర్తమానాన్నీ కూడ నారాయణస్వామి గానం చేస్తున్నంత నైసర్గికంగా కవితామయంగా కూడ ఆస్వాదించవచ్చు. ఒక సాంస్కృతిక పూర్వరంగం మీద ఈ దృశ్యాన్ని రూపుకడితే మరింత లోతుగానూ అర్థం చేసుకోవచ్చు.

ఎనభైల తొలిరోజుల్లో విప్లవ విద్యార్థి ఉద్యమంలోకీ, విరసంలోకీ బలంగా, ఉధృతంగా తోసుకొచ్చిన అనేక కెరటాలలో ఒకరు నారాయణస్వామి. ఇరవై నాలుగేళ్ళ కింద విద్యార్థి ఉద్యమ కార్యకర్తగా ఉత్సాహంతో కుతూహలంతో విరసంలోకి ప్రవేశించి నిత్యమూ కవిత్వమే ప్రాణంగా ఉద్వేగభరితంగా సంభాషిస్తుండిన స్వామి రూపం ఇప్పటికీ కళ్ళకు కడుతుంది. మెదక్ పల్లెటూరి నుంచి జెఎన్‌టియు దాకా అప్పటికే స్వామి చేసిన ప్రయాణం సుదీర్ఘమనది. అయినా వడి తగ్గని కెరటం అది. అప్పటి నుంచి ఆ తర్వాత పదిహేను సంవత్సరాలు మేం అత్యంత సన్నిహితంగానూ మెలిగాం, అతి తీవ్రంగానూ ఘర్షించుకొన్నాం. స్వామి స్నేహం, స్వామి అమాయకత్వం, ఉత్సాహం, కవిత్వం మీద ప్రేమ, ఒక కార్యాచరణలో భాగస్వాములుగా మేం పంచుకొన్న పనులు, ఉద్రేకాలు, ఆలోచనలు, కోపతాపాలూ - అదంతా ఒక వైభవోజ్జ్వల శకం.

అప్పుడు కవిగా, ఉపన్యాసకుడిగా, అనువాదకుడిగా, విశ్లేషకుడిగా, ఆలోచనాపరుడిగా స్వామి గొప్ప ఆశను కల్పించాడు. ఒక మెదక్ జిల్లా బిడ్డడు రాష్ట్రం నలుమూలలా విప్లవభావ ప్రచారకుడిగా విస్తరించాడు. తన తొలి కవితా సంపుటం కల్లోల కలల మేఘం తనను సున్నితమైన, ఆర్ద్రమైన అభివ్యక్తి పలికించగల భావుకుడైన విప్లవ కవిగా నిలబెట్టింది.

దేశంలో నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైన తర్వాత స్వామి కవిత్వం కన్న ఎక్కువగా సామాజిక విశ్లేషణలోకి ప్రవేశించాడు. సామ్రాజ్యవాదం మీద, సంస్కృతి మీద విలువైన, లోతైన విశ్లేషణలు చేశాడు.

అట్లా ఎందరినో తన ప్రభావంలో ముంచెత్తిన ఈ మంజీర అల బహుశా తాను నమ్మిన విప్లవోద్యమంలోని ఒక సంక్షోభాన్ని జీర్ణించుకోలేకపోయింది. సరిగ్గా అప్పుడే తాను ఎంతగానో ప్రేమించిన బాపు మరణం. సరిగ్గా అప్పుడే విప్లవోద్యమాన్ని నిందిస్తున్న అస్తిత్వ ఉద్యమాల హోరు.

ఆ సంక్షోభాల నుంచి, విచారాల నుంచి బైటపడడంలో స్వామికి మేం అందించవలసినంతగా చేయి అందించలేదేమోనని ఇప్పుడనిపిస్తున్నది. తాను ఉద్యమానికి, సమాజానికి, తన చుట్టూ ఉన్న సమూహానికి ఎంత చేశాడో దానికి సమానంగా కాకపోయినా ఎంతో కొంత ప్రతిఫలం అందినట్టు లేదు. నా వరకు నేను తాను ఆ విచారాల నుంచి బైటపడేందుకు ఏమీ చేయలేదు సరిగదా, అమెరికా వెళుతున్నానని ఎనిమిదేళ్ళ కిందట చెప్పినప్పుడు కొంచెం కటువుగా ప్రతిస్పందించినట్టు గుర్తు. అప్పటి నా వ్యక్తిగత అతిశయాన్ని, ఉద్యమంలో మొత్తంగా ఉండిన అసహనాన్ని, సంకుచితత్వాన్ని ఇప్పుడు అంచనా వేసుకోగలమే తప్ప చేయగలిగింది లేదు.

ఆ తర్వాత ఈమెయిళ్ళలోనో, ఫోన్ సంభాషణల్లోనో స్వామి హృదయం అవగతమవుతూ వచ్చింది. హృదయం ఉండవలసినచోటనే, ఉండవలసినంత ఆర్ద్రంగానే, ఉడవలసినంత నిశితంగానే ఉన్నదని తెలిసి వచ్చింది. తన అమెరికా ప్రయాణ సమయంలోని నా శీతలత్వానికి వాచ్యంగా క్షమాపణలు చెప్పనవసరం లేకుండానే తను నన్ను క్షమించాడనుకుంటాను.

ఏడు సంవత్సరాల ప్రవాసం తర్వాత హఠాత్తుగా ఏడాది కింద స్వామి హైదరాబాదులో దిగాడు. Love is so short, forgetting is so long అనే నెరూడా కవితా సంపుటం పట్టుకొని. ఏ ఉద్వేగాలతో హైదరాబాదులో దిగాడో అంజాన్‌లో చెప్పాడు. కలుసుకుని ఏడేళ్ళ సంగతులు కలబోసుకుందామనుకునేసరికి విరసం మీద నిషేధం, రాష్ట్రంలో మారిన పరిస్థితులు, తాను కలవదలచుకున్న వాళ్ళు కలిసినా ఇతరేతర విచారాల ఒత్తిడి. 'అదే రాత్రి అనే చెట్లను అట్లాగే తెల్లబరుస్తోంది. కాని ఆ కాలపు మేం ఇంకెంతకాలమూ అట్లా లేం,' అని నెరూడాతో గొంతు కలుపుతూ వెనక్కి వెళ్ళిపోయాడు.

బహుశా మొదటి ప్రయాణం కన్న రెండో ప్రయాణమే స్వామి గుండె మీద ఎక్కువ బరువును మోపినట్టుంది. ఇక ఆ బరువు దించుకోవడం మొదలు పెట్టాడు. ఇక్కడి కవితలలో ఎక్కువ భాగం అవే. ఒక రకంగా కల్లోల కలల మేఘం కవితల కన్న ఎక్కువ సాంద్రంగాను, ఆర్ద్రంగాను, పరిణతితోనూ ఈ కవిత్వం వెలువడడం వెనుక వ్యక్తావ్యక్తంగా ఈ నేపథ్యమంతా ఉందనుకుంటాను. ఇంత విశాలమైన నేపథ్యం ఉన్నందువల్లనే ప్రతి కవితా వయ్యక్తిక, సామూహిక, సామాజిక, దేశ, కాల పురాశోకాలను, పురాస్మృతులను పొరలు పొరలుగా తనలో ఇముడ్చుకుంది.

పురాశోకం, పురాస్మృతి కొత్తవేమీ కావు. బహుశా మానవ మస్తిష్కంలోనే పురాస్మృతికీ, పురాశోకానికీ, నోస్టాల్జియాకూ వీలు కల్పించే ధాతువులుండి ఉంటాయి. అది వయసు పెరిగిన చిహ్నం కూడ కాదు. 'నా చిన్నప్పుడు...' అని రెండు మూడేళ్ళ పసిపాపలు కూడ మాట్లాడడం మనందరి అనుభవంలో ఉన్నదే. చుట్టూ అందమైన రూపాలను చూస్తూ, మధురమైన శబ్దాలను వింటూ సుఖంగా ఉన్నప్పుడు కూడ చిత్తం కలత చెంది ఉందంటే జననాంతర సౌహృదాలు ఆత్మలో నెలకొని ఉన్నందువల్లనే అని భావస్థిరాణి జననాన్తర సౌహృదాని అనే సుప్రసిద్ధ శ్లోకంలో కాళిదాసు కూడ అన్నాడు. ఆ తర్వాత గడిచిన ఇన్ని శతాబ్దాలలో పురాస్మృతులను, పురాశోకాలను, నోస్టాల్జియాను ఎంతమంది గానం చేసి ఉంటారో, ఎంతమంది బుద్ధిజీవులు ఈ భావనను వివరించడానికి, విశ్లేషించడానికి ప్రయత్నించి ఉంటారో లెక్కలేదు.

యూరప్‌లోను, అమెరికాలోను గత మూడు నాలుగు దశాబ్దాలలో విస్తరించిన సంస్కృతీ అధ్యయనాలు ఈ పురాస్మృతి భావనను అన్ని కోణాల నుంచి అర్థం చేసుకోవడానికి విపులమైన, కొన్నిసార్లు వివాదభరితమైన చర్చ చేశాయి.

పదిహేడో శతాబ్దం చివరిలో స్వస్థలానికి తిరిగి వెళ్ళదలచి, వెళ్ళడం సాధ్యం కాదేమోనని రోగిపడే మానసిక వేదనగా నిర్వచనం పొందిన నోస్టాల్జియా పందొమ్మిదో శతాబ్దం చివరిదాకా కూడ ఒక మానసిక వ్యాధిగా వైద్యశాస్త్ర పరిభాషలో మాత్రమే ఉండేది. ఆ తర్వాత ఆ భావనకు అర్థాలు మారాయి. అంతకుముందున్న విభిన్నమైన అనుభవాలను కూడ ఈ మాటతో సూచించడం మొదలయింది.

సాధారణంగా అతిశయోక్తులతో, ఆదర్శీకరణతో గతాన్ని కీర్తించడం, దానికోసం తపన పడడం అనే అర్థం దగ్గరి నుంచి, ఆరోజుల్లోని మంచిని, ఆత్మీయతను తలచుకోవడం దాకా ఇప్పుడు ఈ భావనకు అనేక ఛాయాభేదాలున్నాయి. గతకాలము మేలు వచ్చు కాలము కంటెన్, గతమెంతో ఘనకీర్తి అనుకోవడం, ఉన్న స్థలం కన్న విడిచి వచ్చిన స్థలం బాగుందనుకోవడం, ఇంటి మీద ధ్యాస, ఇంటి మీద రంధి, మనాది, విషాదం, 'ఆరోజులెంత బాగుండేవి,' వర్తమానం మీద అసంతృప్తి, విషాదం - ఇలా ఎన్నో ఛాయలలో ఈ భావన ఉంది.

ఒక అమెరికన్ సాహిత్య విమర్శకుడు అన్నట్టు దాదాపు ప్రతి యుగంలోను ఇటువంటి పురాస్మృతులున్నాయి. ప్రతి సాహిత్య యుగంలోను ఆ ధోరణు లున్నాయి. అన్ని యుగాలలోను ఒక గడిచిపోయిన సంప్రదాయం కోసం, ఒక వ్యక్తిగత ప్రతిభ కోసం గతంలోకి తొంగిచూసే ధోరణి ఉంది. కొనసాగింపు-మార్పు అనే ఎడతెగని ధారలో గతంలో కొన్ని లేకుండా ఉంటే బావుండుననే ఆలోచనా ఉంది. గతంలోని కొన్ని అంశాల పట్ల మమకారమూ, అవి కొనసాగితే బావుండుననే అభిప్రాయమూ ఉంది.

అంటే నోస్టాల్జియా అంతా ప్రతికూలమయినదనో, వెనుకచూపు అనో కొట్టి వేయడమూ కుదరదు. పాతనంతా నెత్తికెత్తుకోవడమూ కుదరదు. ఏకకాలంలో దానిలో అనుకూల ప్రతికూల అంశాలు రెండూ ఉంటాయి. దానితో ఐక్యతా ఉంటుంది. ఘర్షణా ఉంటుంది. పురాస్మృతి సరళమైనది కాదు. అది ఏకకాలంలో అనేక స్థాయిలలో అనేక రంగాలలో పనిచేస్తుంటుంది. అది సమాజ సంస్కృతి స్థాయిలో కావచ్చు, వ్యక్తిగత స్థాయిలో కావచ్చు, ప్రత్యక్షంగా, వాచ్యంగా కావచ్చు. పరోక్షంగా, ప్రచ్ఛన్నంగా కావచ్చు. దాని సంక్లిష్టత, సంకీర్ణత ఎలాంటివంటే అది ఎలా వ్యక్తీకరణ పొందుతుంది, ఎలా పనిచేస్తుంది, ఎవరి మీద పని చేస్తుంది, ఎవరిని తన వాహికలుగా చేసుకుంటోంది అని స్పష్టంగా వివరించి విశ్లేషించడం కష్టం. అసలీ పురాస్మృతి చరిత్రా, జ్ఞాపకమా, మతిమరుపా అని ఒక కీలకమైన ప్రశ్నను పాశ్చాత్య సాహిత్య విమర్శ, ముఖ్యంగా సాంస్కృతిక అధ్యయనాలు లేవదీశాయి.

సందుకలోని కవిత్వమంతా ఒక దగ్గర చదివినప్పుడు ఆ చర్చంతా మనసులో సుళ్ళు తిరిగింది. పాశ్చాత్య సాహిత్య విమర్శ విడదీసినట్టుగా చరిత్రను, జ్ఞాపకాన్ని, మతిమరుపును విడదీయనక్కరలేదని, విడ దీయడం సాధ్యం కాదని, అవి మూడూ కలగలిసిపోయి ఉండవచ్చునని, ఇంకా అంత కన్న మించిన అర్థాలు, కోణాలు, స్థాయిలు, క్షేత్రాలు, అభివ్యక్తులూ ఉండవచ్చునని ఈ కవితలు చూపుతాయి.

సందుక కవిత్వంలో చరిత్ర ఉంది. ఆ చరిత్ర గురించి స్థలకాలాలలో దూరం జరిగి నిర్మమంగా వేసిన అంచనాలున్నాయి. ఆ చరిత్రలో అప్పుడు ప్రత్యక్ష భాగస్వామ్యంలో వెలువడిన ఉద్వేగాలున్నాయి. ఆ చరిత్ర కొనసాగుతున్న వేళ పరోక్ష భాగస్వామిగాను, సాక్షిగాను, వ్యాఖ్యాతగానూ ప్రకటిస్తున్న ఉద్వేగాలు న్నాయి. చరిత్ర నిరంతరాయత మీద విశ్వాసం ఉన్నందువల్లనే వర్తమానం గురించి మాట్లాడుతున్న కవితలో గతమూ, గతం గురించి మాట్లాడుతున్న కవితలో వర్తమానమూ పడుగుపేకలా అల్లుకుని సాగుతాయి. ఉత్తిదారాలుగా కనిపించే ఈ పడుగుపేకా రేపు కలనేత వస్త్రమవుతుందనే భవిష్యదాశా ఉంటుంది.


సందుక కవిత్వం నిండా జ్ఞాపకం ఉంది. అది కేవలం పురావస్తువులాంటి స్థిరబిందువు కాదు. అది నెత్తురు, కన్నీళ్ళు నిండిన ఉద్వేగం. రక్తమజ్జాస్థితమైన ముద్ర. దానిలో ఉత్తేజ కారకమైన అంశమూ ఉంది. ప్రస్తుతంతో పోలికా ఉంది. ఆనాటి ఆత్మీయతలూ ఉన్నాయి. ఆనాటి చేదూ ఉంది. ఇవాళ్టి అస్తిత్వానికి మూలం అదేనసే స్పృహా ఉంది. ఆనాటి నుంచి ఈనాటి వరకు నడిచి వచ్చిన దారిలోని వైవిధ్యమూ, వైశాల్యమూ ఆ జ్ఞాపకం మీద పరిచిన కొత్త వెలుగులు ఉన్నాయి.

అందువల్ల విశ్లేషణ కోసం ఇది చరిత్ర, ఇది జ్ఞాపకం అని చెప్పవలసిందే కాని వాస్తవంలో వాటిని విడదీయడం సాధ్యం కాదు. జీవితం, విప్లవం, గతం, సమాజం, కుటుంబం, వ్యక్తిగతం, అధ్యయనం, పరిశీలన, మానవ సంబంధాలు అన్నీ కలగలిసిన చరిత్ర, జ్ఞాపకం, చారిత్రక జ్ఞాపకం కవిత్వంలోకి అనువదిస్తే సందుక అయింది. పాశ్చాత్య సాహిత్య విమర్శకులు చెప్పిన మతిమరుపు కూడ ఇందులో అంతర్లీనంగా ఇమిడిపోయింది. ఆ మతిమరుపు గురించిన ఒకింత ఆత్మనింద అక్కడక్కడా తొంగి చూస్తుంది.

కొత్త అభివ్యక్తిని రూపొందించడంలో, అక్షరాలతో దృశ్యం కట్టడంలో, జీవన సంరంభాన్ని పదాలలోకి తర్జుమా చేయడంలో, ధ్వనినీ, ప్రతీకనూ బహుళార్థక సాధకంగా వాడుకోవడంలో నారాయణస్వామి కల్లోల కలల మేఘం నాటికే చెప్పుకోదగిన విజయాలు సాధించాడు. ఆ విజయాలను ఈ సంపుటం మరింత ముందుకు తీసుకుపోయింది.

సందుక అదనపు విజయాలలో పురాస్మృతిని వైవిధ్యపూరితంగా చిత్రించడంతో పాటు పురాస్మృతికి అత్యవసరమైన వాతావరణాన్ని సృష్టించడం ఒకటి. భాష ద్వారా, తెలంగాణ ఆకాంక్షలను ఎత్తిపట్టడం ద్వారా, తెలంగాణ జనజీవితానికే ప్రత్యేకమైన పదచిత్రాల రూపకల్పన ద్వారా స్వామి తెలంగాణ కవిత్వానికీ, తెలుగు కవిత్వానికీ, విప్లవ కవిత్వానికీ ఒక విలువైన, అరుదైన కానుకను అందిస్తున్నాడు. తెలంగాణ ఆకాంక్షల గురించీ, పురాస్మృతి భావన గురించీ, విప్లవ కవిత్వ విస్తృతి గురించీ కొత్త ఆలోచనలకు పురికొల్పుతున్నాడు. రండి సందుకలోంచి పాత కొత్త సువాసనలను ఆస్వాదించడానికి...

హైదరాబాద్, 3 ఆగస్టు 2006



నారాయణస్వామి

కవితల

సందుక

ఝరి పొయిట్రీ సర్కిల్, హైదరాబాద్



SANDUKA

NARAYANASWAMY

Collection of Poems

First Edition: 7th August 2006

Cover Paintings: **Laxman Aley**

Cover Design: **Sita**

Published by
Jhari Poetry Circle,
16-2-740/75/40, V.K. Dhage Nagar,
Gaddi Annaram, Dilsukhnagar,
Hyderabad-500 660.

Poets Address
Swamy Venkatayogi
168, Windham Ct, Princeton, NJ 08540
swamyv@gmail.com

Copies available at
Visalandhra Book House, Hyderabad and its branches in A.P., **Prajashakti Book House,** Chikkadpally, Hyderabad and its branches in A.P. , **Navodaya Book House,** Badichowdi, Hyderabad, **Disa Pustaka Kendram,** Chikkadpally, Hyderabad, **Navodaya Publishing House,** Eluru Road, Vijayawada.

Composed at
Akshara Creators, AG-2, A-Block, Mathrusri Apts., Hyderguda, Hyderabad. Ph: 23244088

Printed at
Charita Impressions, Azamabad Industrial Area, Hyderabad. Phones: 040-27678411

Rs. **25. $5**